క్లుప్తంగా

అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో కొలువుదీరిన గిరిదుర్గా భవానీ అమ్మవారిని శుక్రవారం శ్రీ కాత్యాయిని అమ్మవారి స్వరూపంగా అలంకరణ చేసి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. లోక కల్యాణార్థం ప్రత్యేక పూజలు చేసినట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. లంకా అయ్యప్పశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, మహాలక్ష్మీ హోమం, భువనేశ్వరిదేవికి కుంకుమ పూజ నిర్వహించారు.భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి రమేష్

ముంచంగిపుట్టు: మండలంలోని జర్జుల పంచాయతీ అంబాపాడ, పెద్దతమ్మెంగుల గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. కిలగాడ వైద్యాధికారి ఎస్.రమేష్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని. దోమతెరలను వినియోగించాలని సూచించారు. రోగులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీహెచ్ఈవో సుబ్రహ్మణ్యం, హెల్త్ అసిస్టెంట్లు నాగరాజు, గౌరి, ఎంఎల్‌హెచ్‌పీ దీప్తి, దాలిమ్మ తదితరలున్నారు.

సోషల్ ఆడిట్‌పై శిక్షణ



మాట్లాడుతున్న డీఆర్‌పీ, పక్కన ఎంఈవో

కొయ్యూరు: మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం మండలస్థాయి సోషల్ ఆడిట్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు చేపట్టాల్సిన మధ్యాహ్న భోజనం నిర్వాహణ, నాడు–నేడు పనులు, బోధనేతర అంశాలపై ఎంఈవో బోడంనాయుడు సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ కార్యదర్శి ఆదేశాలతో దీన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చేయాల్సిన పనుల డెమోను వివరించారు. ఉపాధ్యాయులు విధిగా వాటిని పాటించాలని ఎంఈవో సూచించారు. హెచ్ఎం బి.వి. మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

మానసిక రోగులకు వైద్య పరీక్షలు



రోగులకు సూచనలిస్తున్న డాక్టర్ రామిరెడ్డి

కూనవరం: మండలంలోని కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సైక్రియాటిస్ట్ డాక్టర్ రామిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మానసిక రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేసి, కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానసిక రోగులు క్రమం తప్పకుండా మందులు వినియోగించాలని సూచించారు. ప్రతీ నెల మానసిక రోగుల కోసం వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కూనవరం, విఆర్ పురం, చింతూరు, ఎటపాక మండలాల నుంచి పలువురు మానసిక రోగులు శిబిరానికి వచ్చారు.

నేడు బొడ్లంకలో 'గడప గడపకు'

అడ్డతీగల: మండలంలోని బొడ్లంక పంచాయతీలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు.ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొని ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



జి.మాడుగులలో పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



లక్క గ్రామంలో స్థానికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



శరభవరంలో బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



రింతాడలో కరపత్రాలు అందజేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు

జి.మాడుగుల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికలో మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఏఎస్సార్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జగనన్న పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రజల చెంతకే పాలన అందుతోందన్నారు. ఎన్నడూ లేని విధంగా గిరిజన ప్రాంతాభివృద్ధి జరుగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ మత్స్యరాస వెంకటలక్ష్మి, సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు విజయకుమారి, సన్యాసిదొర, మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, నాయకులు బంగ్రరాజు, వలసయ్య, అబ్బాయిదొర, నరసింహమూర్తి, గాయత్రి, శ్రీనివాస్‌నాయుడు, మణి, కన్వీనర్లు బాబూరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల చెంతకే పాలన అందుతోందని, పారదర్శకంగా అన్ని వర్గాలకు పథకాలు అమలవుతున్నాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని గుంటగన్నెల పంచాయతీ లక్క,కొరంజిగుడ గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 122 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించి, సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందన్నారు. సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక సమస్యలను పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మొద్దు, సర్పంచ్ నాగేశ్వరరావు, ఉప సర్పంచ్‌లు జగ్గునాయుడు, త్రినాథ్, నాయకులు శ్రీరాములు, సింహాచలం, కృష్ణారావు, కన్వీనర్ గణపతి, మల్లేష్, ఎంఆర్‌సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: పేద ప్రజల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని శరభవరం సచివాలయ పరిధిలో శరభవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హత కల్గిన ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు సత్యవేణి, సర్పంచ్ లక్ష్మీదేవి, నాయకులు బాబ్జి, సత్తిబాబు, మురళీకృష్ణ, పెద్దబ్బాయిదొర, రాంబాబు, రామకృష్ణ, సీతారాం, శివరామకృష్ణ, వెంకట్రావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందని మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్ అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు పార్టీశ్రేణులు గ్రామాల్లో పర్యటించి, సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించారన్నారు. వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, నాయకులు బాబురావు, మల్లేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని రింతాడలో జరిగిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, సర్పంచ్‌లు లక్ష్మి, రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, కన్వీనర్ చలపతి, ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మణ్‌కోటి తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: మండలంలోని బొడ్డుగూడెంలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో సర్పంచ్ సవలం సత్తిబాబు, పీఏసీఎస్ ఛైర్మన్ శ్యామల విజయ్‌రెడ్డి, ఉప సర్పంచ్ భూక్యా బాబూరావు, నేతలు జోగయ్య, సుబ్బు, ప్రవీణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల కన్వీనర్ సంపత్‌కుమార్



బొడ్డుగూడెంలో బ్రోచర్లు అందిస్తున్న సర్పంచ్, నాయకులు

గ్రామాల్లో గృహాల సర్వే



చీడికోటలో లబ్ధిదారుడితో మాట్లాడుతున్న సిబ్బంది

కొయ్యూరు: మండలంలోని ఎం.భీమవరం పంచాయతీ చీడికోట తదితర గ్రామాల్లో హౌసింగ్ సిబ్బంది శుక్రవారం పర్యటించారు. ప్రభుత్వ గృహాల నిర్మాణాలపై సర్వే చేపట్టారు. ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిందని, పనులు ప్రారంభించాలని కోరారు.

ముమ్మరంగా దోమల నివారణ మందు పిచికారీ



పోలీసుస్టేషన్‌లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం దోమల నివారణ మందును పిచికారీ చేశారు. మలేరియా కేసులు నమోదవుతుండడంతో ముందస్తు జాగ్రత్తగా పిచికారీ చేయిస్తున్నట్టు వైద్యాధికారి రమేష్ అన్నారు. ఏఎస్ఐ తిరుపతిరావు, హెల్త్ అసిస్టెంట్ అశోక్, ఏఎన్ఎం మహేశ్వరి ఉన్నారు.

ఎంపీటీసీ సభ్యుడికి పరామర్శ

చింతూరు: స్థానిక ఏరియా ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న చదలవాడ ఎంపీటీసీ సభ్యుడు సవలం నరేష్‌ను ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి శుక్రవారం పరామర్శించారు. అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వారు ఏరియా ఆస్పత్రిని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. జ్వరాలు అధికంగా ఉన్నందున మెరుగైన వైద్యం అందించాలని, జ్వరపీడిత గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని వైద్యులకు సూచించారు. నాయకులు కోట్ల కృష్ణ, సాయిబాబు పాల్గొన్నారు.



ఎంపీటీసీ సభ్యుడు నరేష్‌ను పరామర్శిస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు మురళీ

సమన్వయంతో పనిచేయాలి

పెదబయలు: మండల కేంద్రంలోని ఎంపీపీ బొండా వరహాలమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వరహాలమ్మ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వైద్యాధికారి సింధూరం పడాల్ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, గర్భిణులకు ప్రసవానికి ముందుగా ఆస్పత్రుల్లో వెయిటింగ్ హాల్‌లో చేర్పించాలని సూచించారు. ఎంఈవో సింహాచలం మాట్లాడుతూ నాడు–నేడు పథకం ద్వారా మండలంలోని 56 పాఠశాలల్లో రూ.12.66 కోట్లతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు.మండల పరిషత్ క్వార్టర్స్‌లో సిబ్బంది కాకుండా ఇతరులు నివాసముంటున్నారని, ఖాళీ చేయడానికి నోటీసులు జారీ చేయాలని పలువురు కోరారు. కాఫీ తోటల పెంపకం, రైతులకు సకాలంలో విత్తనాల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేశామని ఏవో శ్రీనివాస్ చెప్పారు. బోయ, వాల్మీకులకు ఎస్టీ జాబితాలోచేర్చే విషయాన్ని వ్యతిరేకిస్తూ సభ్యులు తీర్మానం చేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, నిలువరించాలని ఎంపీటీసీ సభ్యుడు బొంజుబాబు, సర్పంచ్ మాధవరావు కోరారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై శాఖపరమైన చర్యలకు కలెక్టర్‌కు నివేదిస్తామని ఎంపీడీవో పూర్ణయ్య చెప్పారు. తహసీల్దార్ భాస్కరరావు, వైస్ ఎంపీపీ సోనే, రాజుబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ వరహాలమ్మ

భూరీసర్వేకు రైతులకు ముందస్తు సమాచారం

- ప్రతీ గ్రామంలో ముందుగా గ్రామసభలు
- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలోని వైఎస్సార్ భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా భూములు రీసర్వే చేసే సమయంలో ప్రతీ గ్రామంలో ముందుగా గ్రామ సభలు నిర్వహించడమే కాకుండా రైతులకు ముందుగా సమాచారం ఇవ్వాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం ఏడు మండలాలకు సంబంధించిన సర్వే అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వే అధికారులు, వీఆర్వోలతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని భూ హక్కు భూ రక్ష పథకం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు భూముల సర్వేకు సంబంధిత గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. సంబంధిత రైతులకు ముందుగా నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతీ గ్రామంలో సర్వే రికార్డులు పరిశీలించి ఏ రైతుకు ఎక్కడెక్కడ హద్దులు ఉన్నాయో సర్వే చేసి సంబంధిత రైతులకు హద్దులు చూపించాలని సూచించారు. రీసర్వేకు సంబంధించి ఎవరైనా రైతులను ఇబ్బంది పెడితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రీసర్వే ద్వారా గిరిజన రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పూర్తి న్యాయం చేసే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మండలాల వారీగా సంబంధిత అధికారులతో సమీక్షించారు. భూ హక్కు భూ రక్ష పథకం ద్వారా సర్వే పూర్తయిన వెంటనే నిబంధన ప్రకారం హక్కు పత్రాలు రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె. దేవేంద్రుడు, ఎస్‌డీసీ డీఎస్ శాస్త్రి, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్లు రవిశంకర్, రాజశేఖర్, ఏవో యం.సావిత్రి, తహసీల్దార్లు శ్రీమన్నారాయణ, సుబ్రమణ్యం, డీటీ రామకృష్ణ, కె.సుధాకర్‌బాబుు, మండల సర్వేయర్ కుమారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే

కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు అందజేస్తున్న దృశ్యం

రంపచోడవరం: మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లద్దాలను శుక్రవారం పంపిణీ చేశారు. మండల కేంద్రంలో గిరిజన మిత్ర వెల్ఫేర్ సొసైటీ, ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో అవసరమైన వారికి కళ్లద్దాలను అందజేసినట్టు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఉదయ్ శ్రీనివాస్ చెప్పారు. ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో సంస్థ తరఫున కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాగేశ్వరకావు ,రాజు, లోవ అరుణ శివకృష్ణ, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునకు అభినందనలు



నాగార్జున

చింతూరు: వైఎస్సార్‌సీపీ దివ్యాంగ విభాగం జిల్లా అధ్యక్షుడిగా చింతూరు మండలం కుమ్మూరు సర్పంచ్ ముచ్చిక నాగార్జున నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సమాచారం ఇచ్చినట్టు నాగార్జున తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని, పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. నాగార్జునకు పదవి రావడంపై నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

క్షయ నివారణ ప్రభుత్వ లక్ష్యం



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా క్షయ నియంత్రణ అధికారి విశ్వేశ్వరనాయుడు

చింతపల్లిరూరల్: క్షయ వ్యాధి పూర్తి స్థాయిలో నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా క్షయ నియంత్రణ అధికారి విశ్వేశ్వరనాయుడు అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆయన శుక్రవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ల్యాబ్‌ను పరిశీలించారు. ఆస్పత్రిలో నమోదైన క్షయ రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరు క్షయ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ విగ్నేష్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని నందివలస బాలికల పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఆఫీస్ రూమ్‌లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫోటో ఉండాలనే నిబంధన ఉన్నా ఎందుకు పెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో వెంటనే పెట్టాలని హెచ్ఎంకు ఆదేశించారు. పాఠశాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఎవరైన అనారోగ్యం బారిన పడితే తక్షణమే ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య సేవలందించాలన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్నట్టు ఎమ్మెల్యేకు పలువురు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పాల్గుణ జూన్ నెలలో ఉపాధ్యాయుల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు సత్యవతి, నాయకులు తదితరులున్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ

ఉపాధి పనుల పరిశీలన

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ సర్సిపుట్టు, బీటా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో ఆర్.వి.ఎస్.రమేష్ శుక్రవారం పరిశీలించారు.ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉంటూ పనులు చేయాలని సూచించారు. పని వేళకు రావాలని, ఎండ తక్కువ ఉన్న సమయంలోనే పనులు పూర్తి చేయాలని, ఉపాధి పని ప్రదేశంలో ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని కూలీలకు సూచించారు. పని ప్రదేశంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని వీఆర్పీ పోదలంకు సూచించారు. అనంతరం గ్రామాల్లో పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. సర్సిపుట్టు, బీటా పాఠశాలలకు భవన సమస్యను విద్యార్థుల తల్లిదండ్రులు ఎంపీడీవోకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి భవన సమస్యను పరిష్కరిస్తామన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేష్

సమస్యల పరిష్కారానికి వినతి

అరకులోయ రూరల్/ముంచంగిపుట్టు/చింతపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అరకులోయ, ముంచంగిపుట్టు, చింతపల్లి ప్రాంతాల్లోని ఆస్పత్రుల వద్ద కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. నాయకులు బాలదేవ్, భీమరాజు, చిన్నయ్యపడాల్ వేర్వేరుగా మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.16వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి వైద్య విధాన పరిషత్ ద్వారా జీతభత్యాలు చెల్లించాలని కోరుతూ వైద్యాధికారులు మౌనిక, ఆస్పత్రి సూపరింటెండెంట్ కీర్తిలకు వినతిపత్రాలు అందజేశారు. కార్మికులు రాజేష్, కోటి, మోహన్ తదితరులున్నారు.

భానుడి భగభగ



పాడేరు పాతబస్టాండ్‌లో గొడుగుల నీడలో చిరువ్యాపారులు

సాక్షి, పాడేరు: చల్లటి వాతావరణానికి పేరొందిన మన్యంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఏజెన్సీలో శుక్రవారం ఎండ విజృంభించింది. ఉదయం 8గంటల వరకు పొగమంచు కురిసినప్పటికీ సూర్యోదయం అయిన సమయం నుంచే ఎండ చుర్రుమంది. మధ్యాహ్నం 12 గంటల సమయానికి ఎండ తీవ్రత మరింత అధికమైంది. పాడేరు, అరకు వారపు సంతల్లో గిరిజనులు, వ్యాపారులు అధిక ఎండను తాళలేకపోయారు. గొడుగులను ఆశ్రయించారు. ఎండతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాడేరులో 36డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం నాలుగు గంటలకు ఆకాశమంతా మబ్బులు నెలకొనడంతో వాతావరణం చల్లబడింది.

నేడు పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం

రాజవొమ్మంగి: ప్రతి పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలని ఎంఈఓ తాతబ్బాయిదొర పాఠశాలల యాజమాన్యాలను సూచించారు. వేసవి సెలవులకు ముందు ఆఖరి పని దినం నాడు నిర్వహించనున్న సమావేశానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హాజరుకావాలన్నారు. ఉపాధ్యాయులు తమ హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు

7న అల్లూరి వర్ధంతి

కొయ్యూరు: మండలంలోని మండల గ్రామంలోని అల్లూరి పార్కును జాతీయ అల్లూరి యువజన సంఘం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు తదితరులు శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 7న అల్లూరి సీతారామరాజు వర్ధంతి నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. సంఘం ప్రతినిధులు వరలక్ష్మి, బూర్గులయ్యా, రాజుబాబు, అప్పలకొండ, రాజుబాబు, సత్తిబాబు పాల్గొన్నారు.

సామాజిక సేవకు పురస్కారం

చింతపల్లిరూరల్: విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో దాసరి నారాయణరావు కల్చరల్ అనుబంధ సంస్థ, విశాఖరత్న ఆధ్వర్యంలో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో సేవలందించిన వారికి పురస్కారాలు అందించారు. ఇందులో భాగంగా చింతపల్లి మండలానికి చెందిన దూనబోయిన రమణకు మాజీ డిప్యూటీ మేయర్ సత్యనారాయణ, విశాఖ ఏపీ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు భాస్కరరావు చేతులమీదుగా అవార్డు అందజేశారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

అరకులోయ రూరల్/చింతపల్లి: వినియోగదారులు విద్యుత్ బిల్లులను సకాలంలో చేలించాలని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శివసత్యనారయణ, చింతపల్లి విద్యుత్ శాఖ ఏఈ వెంకటరమణ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. బిల్లులు సకాలంలో చేల్లించకపోతే అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని, బిల్లు అందజేసిన 15 రోజుల్లోగా చేల్లింపులు చేస్తే ఎటువంటి రుసుము ఉండదని పేర్కొన్నారు. గడువులోగా బిల్లు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి సహకరించాలని కోరారు.

వాహన తనిఖీలు

మునగపాక : వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని మునగపాక ఎస్ఐ మహమ్మద్ ఆలీ సూచించారు. వాహనాలు నడిపేటపుడు సంబంధిత రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. శతోటాడ జంక్షన్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు.